రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు

- రహదారి విస్తరణ కారణంగా స్థలాలను కోల్పోతున్న వైనం
- ఉపాధికి దూరమైన నిరుపేదలు
- ప్రత్యామ్నాయం చూపని అధికారులు


రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించిన హోటల్


రేకుల షెడ్డును తొలగిస్తున్న చిరువ్యాపారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెదక్ నుంచి రుద్రూర్ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల కారణంగా నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో చిరువ్యాపారుల కలలు చెదురుతున్నాయి. రోడ్డు పక్కన ఏళ్ల తరబడి దుకాణాలను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న కొంత మంది చిరు వ్యాపారులు రోడ్డున పడుతున్నారు. తమ గ్రామంలోని రాష్ట్ర రహదారి జాతీయ రహదారిగా మారి అభివృద్ధి చెందుతుందని సంతోషపడాలో లేక ఇన్నాళ్లూ తమ పొట్ట నింపిన దుకాణాలు తీసేయాల్సి వస్తుందని బాధపడాలో చిరువ్యాపారులకు తెలియడంలేదు. మెదక్ నుంచి రుద్రూర్ వరకు ఉన్న రోడ్డును కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి–765డిగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకుగానూ 2022లో రూ.899 కోట్ల నిధులను సైతం మంజూరు చేసింది. దీంతోపాటు ఈ యేడు మార్చి 5న పటాన్‌చెర్వులో నిర్వహించిన విజయ సంకల్పసభలో భారత ప్రధాని నరేంద్రమోదీ మెదక్ టూ రుద్రూర్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. నాలుగు రోజులుగా గోపాల్‌పేటలో రహదారి విస్తరణ పనులు జోరందుకున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న చెట్ల తొలగింపు పనులతో పాటు మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు పనులు, విద్యుత్‌స్తంభాల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసుకున్న పాన్‌షాపులు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బార్బర్, లాండ్రీషాపులు, బైక్ మెకానిక్, సైకిల్ దుకాణం, టైర్‌పంక్షర్ దుకాణం..ఇలా రకరకాల చిరువ్యాపారులు రోడ్డున పడ్డారు. ఏళ్ల తరబడి తమకు ఉపాధి చూపుతూ, కడుపునిండా ఇంత అన్నం పెట్టిన దుకాణాలను బరువెక్కిన గుండెతో, చెమ్మగిల్లిన కళ్లతో తొలగించుకుంటున్నారు.దుకాణాల ఏర్పాటు సమయంలో రూ.50 వేల నుంచి రూ.70వేల వరకు వెచ్చించి తయారు చేసుకున్న రేకులషెడ్లను ప్రస్తుతం తప్పనిసరైన పరిస్థితుల్లో రూ.15 వేల నుంచి రూ.20 వేలకు అమ్ముకుంటున్నారు. తొలగించిన దుకాణాలకు సంబంధించిన రేకులషెడ్లను ప్రస్తుతం పెట్టుకోవడానికి స్థలాలు లేక ఎంతోమంది నిరుపేదలు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు.

లాండ్రీ దుకాణంతో బతుకుతున్నా..



ఇరవై ఏళ్లుగా రోడ్డు పక్కన లాండ్రీ దుకాణం పెట్టుకొని బతుకుతున్నా. దుకాణంలోనే బట్టలు ఐరన్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇప్పుడు రోడ్డు పెద్దగ అయితదని దుకాణాలను తీసేపిస్తుండ్రు. ఇన్నేళ్లు బతికిన స్థలాన్ని విడిచి వెళ్లేందుకు మనసురావడం లేదు.
– చాకలి సాయిలు, గోపాల్‌పేట

సైకిల్ దుకాణం నడుపుతున్నా..



నేను పదిహేనేళ్లుగా గోపాల్‌పేటలో రోడ్డు పక్కన సైకిల్ దుకాణం నడుపుతున్నా. నాకు సైకిల్ దుకాణమే జీవనాధారం. రోజూ సైకిళ్లు రిపేర్ చేసుకుంటూ బతుకుతున్నా. ఇప్పుడు రోడ్డు వెడల్పులో భాగంగా నా దుకాణం తీసేయాల్సి వచ్చింది. దీంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి.
– మలాన్, గోపాల్‌పేట

విఘ్నాలు తొలగించు విఘ్నేశా..


లింగంపేటలో వినాయకునికి పూజలు


గున్కుల్‌లో పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గణేశ్ మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాలను శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి విఘ్నాలను తొలగించు అంటూ లంబోదరుడిని వేడుకున్నారు. అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రివేళ మండపాల వద్ద భక్తి పాటలను ఆలపించారు. భజనలు చేశారు. కొన్నిచోట్ల వినాయకులను నిమజ్జనానికి తరలించారు. పలువురు ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు గణేశ్ మండపాలను దర్శించుకుని పూజలు చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కామారెడ్డి పట్టణంలోని పలు వినాయక మండపాలను దర్శించుకున్నారు.


అడ్లూర్‌ఎల్లారెడ్డిలో ఓం యూత్ క్లబ్ గణేశ్ మండపం వద్ద భజన కీర్తనలు


రాజంపేట: హిందూవాహిని యూత్ ఆధ్వర్యంలో..


తిప్పాపూర్‌లో కుంకుమ పూజలు చేస్తున్న మున్నూరుకాపు సంఘం మహిళలు


దోమకొండలోని వినాయక మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


ఎమ్మెల్యే కేవీఆర్‌ను సన్మానిస్తున్న హిందూసేన మండపం నిర్వాహకులు


గాంధారిలో పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఎస్సై ఆంజనేయులు


సదాశివనగర్‌లో మర్రి ఊడలతో ఆకట్టుకుంటున్న సమర్థయూత్ గణేశ్ మండపం


తిమ్మక్‌పల్లిలో నిమజ్జనానికి తరలిస్తూ..


దేవునిపల్లిలో ..

రూ.29 వేలు పలికిన లడ్డు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామానికి చెందిన నారాయణ గణేష్ లడ్డూను రూ.29 వేలకు దక్కించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయకుడి లడ్డూను వేలం వేయగా నారాయణ దక్కించుకున్నారు.


వేలంపాటలో దక్కించుకున్న నారాయణ

క్లుప్తంగా

మోడల్ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీ



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళతో పాటు 12 మంది ఉపాధ్యాయులు శనివారం బదిలీపై వెళ్లారు. 12 సంవత్సరాల నుంచి అచ్చంపేట ఆదర్శ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ బదిలీ కావడంతో పాఠశాల ఖాళీ అయింది. బదిలీపై వెళ్తున్న టీచర్లకు వసతి గృహ విద్యార్థినులు వీడ్కోలు పలికారు.

ఎల్లారెడ్డి స్కూల్ ఉపాధ్యాయులు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం బదిలీ అయినట్లు సిబ్బంది తెలిపారు. ప్రిన్సిపల్ సాయిబాబా నిజాంసాగర్‌కు, శశిశంకర్ జోగిపేట, అంజులప్ప చేవెళ్లకు, నాగరాజు, భాగ్యలక్ష్మి సదాశివనగర్‌కు, గంగాప్రసాద్ డిచ్‌పల్లికి, స్రవంతి రామాయంపేటకు, లక్ష్మీనర్సయ్య ధర్పల్లికి, జనార్దన్ నందిపేటకు బదిలీ అయినట్లు వారు తెలిపారు.

రోడ్డును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): యాచారంతో పాటు నాలుగు గ్రామ పంచాయితీలకు సంబంధించిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, మండలాధ్యక్షుడు సంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా తండా వాసులకు భరోసా కల్పించారు. పీఆర్ ఏఈకి రోడ్డు పరిస్థితి వివరించడంతో రెండు రోజుల్లో వచ్చి రోడ్డును పరిశీలించనున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం ఎన్ని నిధులు అవసరం అవుతాయో పేర్కొననున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు సురేందర్ నాయక్, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



బీబీపేట: ఏడు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి శనివారం ఎస్సై ప్రభాకర్ అందజేశారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పంపరి నరేష్ ఫిబ్రవరి 7న తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఐఎంఈఐ నంబర్‌తో సీఈఐఆర్ ద్వారా మొబైల్‌లను గుర్తించి నరేష్‌కు అందజేశారు.

సేవింగ్ ఖాతాలు సద్వినియోగం చేసుకోవాలి



నిజాంసాగర్(జుక్కల్): పోస్టాఫీసు సేవింగ్ ఖాతాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ అధికారి మహబూబ్ సూచించారు. శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టాఫీసు సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీపీఎంలు రఘువీర్, యూసుఫ్, మమత, నిఖిత, నవతేజ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును కలిశారు. మూడు రోజుల క్రితం హైద్రాబాద్‌లో జరిగిన ఘటనకు నిరసన తెలుపుతూ హరీష్‌రావును కలసి మద్దతు తెలిపారు. బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు మెట్టు రాములు, నాయకులు గోల్కొండ రాజయ్య, గైని రాజయ్య, రాజు కలిసిన వారిలో ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని హసన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తక్షణమే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్మికులు మృతిచెందితే అంతక్రియలకు రూ. 30 వేలు, 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 8న కలెక్టరేట్‌ల ముట్టడి ఉంటుందని, ప్రభుత్వం స్పందించకుంటే సీడీఎంఏ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సీపీఎం నేత సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజనర్సు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహం పెంపొందుతుంది



భిక్కనూరు: యువతకు క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో మినీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడల్లో ప్రతిభ చూపాలని, అప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఓటమి గెలుపునకు పునాది వంటిదన్నారు. యువజన సంఘాల ప్రతినిధులు గంగళ్ల రవీందర్, రమేష్, శ్రీనివాస్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న బోర్లం గ్రామస్తులు


సన్మానిస్తున్న కాంగ్రెస్ యువ నేత దినేష్‌రెడ్డి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న షబ్బీర్ అలీ

ఎల్లారెడ్డిరూరల్/నిజాంసాగర్/బాన్సువాడరూరల్/కామారెడ్డి టౌన్: బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించడంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, నిజాంసాగర్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌కు వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు. శాలువా, పూలబొకేలతో సన్మానించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, మండలాధ్యక్షుడు సంగారెడ్డిలు సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. నాయకులు పొన్న నర్సయ్య, గాదె చిన్నన్న, కమలాకర్ రావు, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


ఎండ్రియాల్‌లో సమావేశమైన పార్టీ శ్రేణులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఎండ్రియాల్, చిట్యాల గ్రామాలలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలున్నట్లయితే మాకు చెప్పినట్లయితే ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. నాయకులు షౌకత్‌అలీ, నరేందర్‌రెడ్డి, అఖిల్‌రావు, లక్ష్మణచారి, సుధాకర్‌రావు, రాజు, రాజిరెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువ పనులు ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ మురికి కాలువ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఇటీవల భారీ వర్షాల వల్ల పట్టణంలో మురికి కాలువలు, రోడ్లు ధ్వంసం అయ్యాయని, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పట్టణంలో పర్యటించి నిధులు విడుదల చేయించారని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్: వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకుని, సాగు ఖర్చులు తగ్గించుకోవాలని పద్మపాని ఎన్‌జీవో ప్రతినిధి భూపతి అన్నారు. శనివారం ఆయన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హన్మాజీపేట్ గ్రామ రైతులకు డ్రోన్ల ద్వారా పంట పొలాలకు క్రిమిసంహారక మందు పిచికారీ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఒక ఎకరం వరిపంటకు పిచికారీ చేయడానికి 6 నుంచి 10 నిమిషాల సమయం పడుతుందన్నారు. రైతులు సంజీవులు, రాజు, కుంట సుధాకర్,గంగాధర్,ప్రకాష్ పాల్గొన్నారు.

హిందీ మాట్లాడటం కూడా నేర్చుకోవాలి



బిచ్కుంద(జుక్కల్): హిందీ దివస్ సందర్భంగా శనివారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హిందీ పండిత్ ఉపాధ్యాయులను సన్మానించారు. తపస్ నాయకులు రచ్చ శివకాంత్, రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కోలావార్ శివకుమార్ హిందీ ఉపాధ్యాయులు మారుతీరావు, వెంకట్‌రావులకు శాలువా, మెమోంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం వెళ్లినా హిందీ మాట్లాడుతారని, అందుకనే తెలుగువారు తెలుగుతో పాటు హిందీ కూడా మాట్లాడడం చదవడం నేర్చుకోవాలని అన్నారు.

నేడు శేఠ్‌కారి గణేష్ మండలి వద్ద అన్నదానం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రథంగల్లీలోని శ్రీ శేఠ్‌కారి గణేష్ మండలి వద్ద ఆదివారం ఉదయం అన్నదానం చేయనున్నట్లు మండలి నిర్వాహకుడు బొగ్గుల్‌వార్ సంజయ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకుడి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

మద్నూర్(జుక్కల్): ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే జీపీ కార్యదర్శికి తెలియజేయాలని డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారి నాగరాజు శనివారం తెలిపారు. డివిజన్‌లోని అన్ని జీపీలలో వార్డుల వారీగా ఓటర్ జాబితాను ప్రచురించామని అన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే 14 నుంచి 26 వరకు అభ్యంతరాల క్లియరెన్స్ ఉంటుందని చెప్పారు.


ఆధ్యాత్మికం

సలాబత్‌పూర్ ఆలయంలో భక్తుల పూజలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహరాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వరాలయంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పాటలు పాడుతూ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని తాంబూలం పాత్రలో ఉంచి ఆలయ ఆవరణలో శావ తీశారు. కామారెడ్డి, తాడ్వాయి మండలాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. భక్తులు సిద్ధిరాంరెడ్డి, గంగారాం, రాజాగౌడ్, తిరుపతిరెడ్డి, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

విభిన్న రూపాలలో గణనాథులు

రాజంపేట: మండల కేంద్రంలో వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో యువత తమ ప్రత్యేకతను చాటుతూ ప్రతి యేటా విభిన్న రీతిలో వినాయక ప్రతిమలను ప్రతిష్టిస్తున్నారు. హిందూదళ్ యూత్ ఆధ్వర్యంలో ఈ ఏడాది సుమారు 3 కిలోల వెండితో వినాయక ప్రతిమ తయారు చేశారు. 3500 వెండి బిల్లలతో పెర్కిట్‌లోని కళాకారులతో వినాయక ప్రతిమను తయారు చేయించినట్లు మండప నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా హిందూవాహిని యూత్ సభ్యులు మల్హార్ స్వామి అవతారంలోని వినాయకున్ని ప్రతిష్ఠించి తమ ప్రత్యేకతను చాటారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో కండోబా మల్హార్ స్వామిగా మన తెలంగాణ రాష్టంలో కొమురవెల్లి మల్లన్నగా పూజిస్తారు.


హిందూదళ్ వెండి వినాయక ప్రతిమ


హిందూవాహిని మల్హార్ స్వామి వినాయక ప్రతిమ

'మహాలక్ష్మి' సర్టిఫికెట్ల పంపిణీ

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించిన మహాలక్ష్మి సర్టిఫికెట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మి, విండో చైర్మన్ రాజాగౌడ్, నాయకులు ఎల్లంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి సంబంధించిన పత్రాలను రేషన్‌షాపులలో పంపిణీ చేశారు. గ్రామంలో ఉన్న రెండు రేషన్‌షాపులలో లబ్ధిదారులకు ఈ పత్రాలను అందజేశారు.